ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 మార్చి
2025



# చక్రస్నానంలో భక్తుల తన్మయత్వం

## గుట్ట పుష్కరిణీలో సుదర్శన ఆళ్వార్ కు స్నానమాచరించిన అర్చకులు

## ఉదయం ఘనంగా మహాపూర్ణాహుతి, చక్రతీర్థం

## సాయంత్రం శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం

## నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 1న ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా పదో రోజు సోమవారం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలను అర్చకులు, యజ్ఞాచార్యులు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉదయం పూర్ణాహుతి నిర్వహించారు. ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో వేదపండితులు, పారాయణికులు, రుత్వికులు, యజ్ఞాచార్యులు మహాపూర్ణాహుతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి చక్రతీర్థం ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. ప్రత్యేక అలంకారంలో స్వామివారిని విష్ణుపుష్కరిణి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి.. గుండం వద్ద నూతన దంపతులైన లక్ష్మీనరసింహుల కల్యాణమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జగత్ రక్షకుడు శ్రీమహావిష్ణువు ప్రధాన ఆయుధమైన మహా సుదర్శన చక్ర ఆళ్వార్‌కు పుష్కరిణిలో చక్రతీర్థస్నానం నిర్వహించారు. లక్ష్మీసమేతుడైన యాదాద్రీశుడు పుష్కరిణిలో స్నానమాచరిస్తున్న ఘట్టాన్ని నిర్వహిస్తున్న సమయంలో భక్తుల జయజయ హర్షధ్వానాల మధ్య పుష్కరిణి ప్రాంగణం మార్మోగింది. "యాదాద్రివాసా, యాదగిరీశా, గోవిందా గోవిందా" నామజపంతో యాదగిరి కొండ పిక్కటిల్లింది. జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భాస్కర్ రావు భక్తులతో కలిసి పుష్కరిణిలో స్నానాలు చేసి తరించారు. అనంతరం నారసింహ జలకమాడిన విష్ణుపుష్కరిణిలోని పుణ్యజలాన్ని ఆలయ ప్రచార రథంలో కొండ కిందికి తీసుకెళ్లి.. భక్తుల కోసం ఏర్పాటు చేసిన లక్ష్మీపుష్కరిణిలో కలిపారు. స్వామివారి దర్శానికి వచ్చిన ప్రతి భక్తుడు స్వామివారు స్నానమాడిన పుణ్యజలాన్ని కలిపిన లక్ష్మీపుష్కరిణిలో స్నానాలు చేసి ఆనందపరవశులయ్యారు.

### దేవత ఉద్వాసన పలికిన అర్చకులు

ఆలయంలో స్వామివారికి నిత్యారాధనలు ముగిసిన అనంతరం సాయంత్రం 6 గంటలకు.. ప్రధానాలయ ముఖ మండపంలో లక్ష్మీనరసింహులను దశావతార స్తోత్రాలతో స్తుతిస్తూ స్వామివారికి ఇష్టమైన పూలతో శ్రీపుష్పయాగం నిర్వహించారు. అనంతరం దేవతోద్వాసన, దోపు ఉత్సవాలు నిర్వహించారు. నరసింహుడి కల్యాణం కోసం ధ్వజారోహణం, డోలారోహణం ద్వారా సకల దేవతలను భువికి ఆహ్వానించిన అర్చకులు.. సాయంత్రం చేపట్టిన దోపు ఉత్సవం ద్వారా ముక్కోటి దేవతలను దివికి పంపే దేవతా ఉద్వాసన కైంకర్యాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదకొండో రోజు మంగళవారం ఉదయం స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహించనున్నారు. దీంతో 11 రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి.


చక్ర తీర్థ స్నానం సందర్భంగా నిర్వహించిన సేవలో పాల్గొన్న యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఏపూరి భాస్కర్ రావు.


ఉత్సవాలు విజయవంతమైన సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ భక్తులపై రంగులు చల్లుతున్న యాగ్నీకులు కిరణాచార్యులు.


యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో సోమవారం విష్ణు పుష్కరిణిలో చక్రస్నానం సందర్భంగా స్నానమాచరిస్తున్న భక్తులు.




చక్ర స్నానం సందర్భంగా నిర్వహించిన సేవలో పాల్గొన్న అశేష భక్తజనం.


విష్ణు పుష్కరిణి వద్ద మంటపంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని అధిష్టించి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు.


సోమవారం రాత్రి ఆలయంలో దేవతో ద్వాసన నిర్వహిస్తున్న అర్చకులు.


యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరైన సమస్తదేవకోటికి వీడ్కోలు పలికే భేరీ పూజ జరుపుతున్న అర్చకులు.


దేవతోద్వాసన సందర్భంగా సోమవారం రాత్రి ఆలయంలో వజ్ర, వైడూర్యాలు... విశేష పుష్పాలంకరణలతో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు.


యాదగిరి కొండపై సోమవారం రాత్రి ఆకట్టుకున్న సంగీత విభావరి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 మార్చి
2025





# గుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**మొదట నారసింహుడిని దర్శించుకుని మహాపూర్ణాహుతిలో పాల్గొన్న గవర్నర్**

**దాదాపుగా 1:15 గంటల పాటు ఆలయంలో గడిపిన గవర్నర్**

**గవర్నర్ కు పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు**

**దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించిన ఆలయ ఈవో. ఏపూరి భాస్కర్ రావు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిర్వహించిన మహాపూర్ణాహుతిలో గవర్నర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేశారు. హైదరాబాద్ రాజ్ భవన్ నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 11:10 గంటల వరకు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. కొండపైకి చేరుకున్న గవర్నర్ కు జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్.. లిఫ్ట్ ద్వారా ప్రధానాలయ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో భాస్కర్ రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తూర్పు రాజగోపురం నుండి త్రితల గోపురం గుండా ఆలయంలోకి చేరుకున్న గవర్నర్ కు ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మొదట గర్భాలయానికి అభిముఖంగా ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భగుడిలోకి వెళ్లారు. దాదాపుగా 15 నిమిషాల పాటు గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. అనంతరం ఉత్తర రాజగోపురం నుండి ఆలయం నుండి బయటకు వచ్చిన గవర్నర్.. ప్రధానాలయ ఈశాన్య దిశలో ఏర్పాటు చేసిన యాగశాలకు చేరుకుని.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. దాదాపుగా 15 నిమిషాల పాటు ప్రత్యేక పూజలు చేసిన ఆయనకు.. అర్చకులు, వేదపండితులు కంకణధారణ చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బ్యాటరీ వెహికిల్ లో ఈవో క్యాంప్ ఆఫీస్ కు వెళ్లి అధికారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు రోడ్డు మార్గంలో కాన్వాయ్ ద్వారా హైదరాబాద్ రాజ్ భవన్ కు వెళ్లిపోయారు.



రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ఆశీర్వచనం చేస్తున్న దేవస్థానము అర్చక బృందం.



యాదగిరిగుట్టకు విచ్చేసిన గవర్నర్ కు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈవో భాస్కరరావు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.



గవర్నర్కు స్వాగతం పలుకుతున్న అడిషనల్ కలెక్టర్, ఆలయ ఈవో భాస్కర్ రావు.



రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు ఆలయంలోకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న దేవస్థానం ప్రధానార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, కాండూర్ వెంకటాచార్యులు ఆధ్వర్యంలోని అర్చక బృందం..ఆలయ ఈవో భాస్కర్ రావు




యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఏపూరి భాస్కర్ రావుతో మాట్లాడుతూ గుట్ట ఆలయ విశేషాలు తెలుసుకుంటున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.



రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు శేష వస్త్రంతో సన్మానిస్తున్న యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఏపూరి భాస్కర్ రావు.



తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో ఏపూరి భాస్కర్ రావు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం

రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

మంగళవారం

11 మార్చి

2025






# సీఎం రేవంత్ చేతగాని దద్దమ్మ: గొంగిడి మహేందర్ రెడ్డి

**యాదగిరిగుట్టపైన పొలిటికల్ డ్రామా**

**ఈవో ఆఫీస్ ఎదుటే మీడియాతో మాట్లాడిన డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి**

**సీఎం రేవంత్, ప్రభుత్వంపై తిట్ల పురాణం**

**సీఎం రేవంత్ 'చేతగాని దద్దమ్మ' అంటూ కాంట్రవర్సీ కామెంట్స్**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఆధ్యాత్మికతకు నిలయమైన యాదగిరిగుట్టపైన సోమవారం పొలిటికల్ డ్రామాకు తెరలేచింది. భక్తులు తెలంగాణ తిరుమలగా కొలుస్తున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరికొండను బీఆర్ఎస్ నాయకులు రాజకీయ క్రీడా ప్రాంగణంగా మార్చారు. ఆలయ నిబంధనల ప్రకారం కొండపైన ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయొద్దు. కానీ అందుకు విరుద్ధంగా పవిత్రమైన టెంపుల్ అనే విషయాన్ని మర్చిపోయిన బీఆర్ఎస్ నాయకులు.. విచ్చలవిడిగా వ్యవహరించి నోటికి పని చెప్పారు. ఆలయ ఈవో భాస్కర్ రావుకు వినతిపత్రం ఇవ్వడం కోసం డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డితో కలిసి కొండపైకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు.. జై కేసీఆర్, కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అంతేకాకుండా ఈవో ఆఫీస్ ఎదుటే డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఏదీ చేతగాని దద్దమ్మ అంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. రూ.1200 కోట్లతో యాదగిరిగుట్ట ఆలయాన్ని కేసీఆర్ కట్టాడు. కొండపైన అడుగడుగునా కేసీఆర్ పేరే ఉంది. యాదగిరిగుట్ట పెండింగ్ పనులకు నయా పైసా ఇవ్వని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులకు టెంపుల్ గురించి మాట్లాడే హక్కే లేదని పొలిటికల్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వాన్ని అసభ్య పదజాలంతో దూషిస్తూ రాజకీయ వ్యాఖ్యలు చేశారు. ఈవోకు వినతిపత్రం ఇచ్చే సమయంలో కూడా బీఆర్ఎస్ నాయకులు విచక్షణ లేకుండా వ్యవహరించారు. అడిషనల్ కలెక్టర్ గా పనిచేసిన ఆలయ ఈవో భాస్కర్ రావుకు కనీస గౌరవం ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులు నోటికి పని చెప్పారు. తాను ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని, ప్రొటోకాల్ ప్రకారమే వ్యవహరించానని ఈవో సమాధానం చెప్తూ వెళ్లిపోతుండగా.. జై కేసీఆర్, జైజై కేసీఆర్, కేసీఆర్ జిందాబాద్ అంటూ ఈవో కార్యాలయంలోనే నినాదాలు చేశారు. దీంతో దాదాపుగా రెండు గంటల పాటు ఈవో ఆఫీస్ రాజకీయాలకు వేదికగా మారింది.

# భద్రాచలంలో కేసీఆర్ మనవడు పట్టువస్త్రాలిస్తే ఎందుకు అడగలేదు.?

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ మాజీ అధ్యక్షుడు భరత్ గౌడ్**



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కల్యాణం రోజున ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి ఆయన సోదరుడు బీర్ల శంకర్ పట్టువస్త్రాలు ఇవ్వడాన్ని తప్పుపడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి.. గతంలో భద్రాచలం బ్రహ్మోత్సవాల సందర్భంగా కేసీఆర్ మనవడు హిమాన్షు పట్టువస్త్రాలు ఇచ్చినప్పుడు ఎందుకు తప్పుపట్టలేదని యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, పట్టణ మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్ గౌడ్ ప్రశ్నించారు. ఏ హోదాలో కేసీఆర్ మనవడు పట్టువస్త్రాలు ఇచ్చారని నిలదీశారు. యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడారు. కేసీఆర్ మనవడికి ప్రొటోకాల్ వర్తించినప్పుడు ఎమ్మెల్యే సొంత సోదరుడికి వర్తించదా.? అని క్వశ్చన్ చేశారు. యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 8న జరిగిన స్వామివారి తిరుకల్యాణం సందర్భంగా.. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు ఆలయానికి సమర్పించారని, ఎమ్మెల్యే సోదరుడు బీర్ల శంకర్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పంపించిన పట్టువస్త్రాలను మాత్రమే తీసుకొచ్చారని క్లారిటీ ఇచ్చారు. అసలు విషయం తెలుసుకోకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నాయకులు అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కొండపైన రాజకీయ వ్యాఖ్యలు చేయొద్దనే కనీస సోయి లేని మహేందర్ రెడ్డి.. ప్రొటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా యాదగిరిగుట్ట దేవస్థానం బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతుండడం బీఆర్ఎస్ నాయకులకు మింగుడు పడడం లేదని ఎద్దేవా చేశారు. ఆలయ ఈవో భాస్కర్ రావు బ్రహ్మోత్సవాలను గొప్పగా నిర్వహిస్తుంటే ఓర్వలేక.. ఈవోపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సొమ్ముతో యాదగిరిగుట్ట దేవస్థానం పునర్నిర్మాణం జరిగిందే తప్ప.. కేసీఆర్ సొంత పైసలతో కాదన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ కేసీఆర్ సొంతం అన్నట్లుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తే ఆ దేవుడే చూసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పార్టీ అధ్యక్షుడు బందారపు బిక్షపతి, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ యాకూబ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు గుడ్ల వరలక్ష్మీ, జిల్లా నాయకులు హేమేందర్ గౌడ్, జీవన్ రెడ్డి, మండల నాయకులు కోల కృష్ణ గౌడ్, నరేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా**



ఇదిలా ఉండగా మరోవైపు, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా తోపాటు అధికారులు మీడియాతో మాట్లాడుతూ జనగామ లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీటిని అందించడానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ధర్మ సాగర్ నుండి గండి రామారం రిజ్వర్వాయర్ కి పంపింగ్ మొదలైంది.. అక్కడ నుండి రేపు బొమ్మకూరు రిజ్వర్వాయర్ కు కుడా పంపింగ్ స్టార్ట్ చేస్తాము అని, అక్కడ లెవల్ పూర్తి కాగానే నీటిని విడుదల చేయడం జరుగుతుంది కాబట్టి రైతులు ఈ విషయాన్ని గమనించి ఆందోళన కు గురి కావద్దని కోరుకుంటున్నాము అంటూ జనగామ ఈరిగేషన్ ఈ ఈ మంగీలాల్ సోమవారం పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

సోమవారం, హైదరాబాదు సచివాలయం నుంచి సాగు నీటి నిర్వహణ, సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగాం లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా సాగునీటినీ తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వరి సాగవుతోందని, ఎగువ భాగాన రైతులు ఎక్కువ మోటార్ లు పెడుతున్నారని, చివరి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని, సాగు నీటి కొరత రాకుండా చూడాలన్నారు. మంత్రులకు జిల్లా కలెక్టర్ వివరిస్తూ ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో నీటి విడుదల పైన ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.

సాగు నీటి తో పాటు తాగు నీటి కి కూడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని జనగామ కలెక్టర్ రెస్మాన్ భాష వివరించారు.



# చేతగాని రేవంత్ రెడ్డి పరిపాలన



**రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంట నష్టం**

**పాలన చేతకాక ప్రకృతి వల్ల కరువు అంటున్న రేవంత్**

**కమిషన్ల కక్కుర్తి తో పరిపాలన అస్తవ్యస్తం**

**కాంగ్రెస్ పాలనపై రేవంత్ రెడ్డి పై విరుచుకుపడ్డ హరీష్ రావు**

**జనగామలో ప్రెస్ మీట్**

జనగామ, మార్చి 10: (రోమింగ్ న్యూస్) పరిపాలన చేతకాక ప్రకృతిపైన, ప్రతిపక్షాలపైన, నిందలు వేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు రేవంత్ రెడ్డి కల్పిస్తున్నాడని, కమిషన్ యొక్క కుర్తీతో రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది అంటూ రాష్ట్ర ప్రభుత్వ పాలనపై రేవంత్ రెడ్డి పై హరీష్ రావు మాటలతూటాలతో విరుచుకుపడ్డారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హరీష్ రావు మాట్లాడారు.

**రేవంత్ రెడ్డిది 20-20 మ్యాచ్ అని,**

ఫైనాన్స్ లో బిల్లులు ఇవ్వాలంటే 20% కమిషన్,రెవెన్యూ డిపార్ట్మెంట్లో భూములకు క్లియరెన్స్ ఇవ్వాలంటే 20% కమిషన్,మున్సిపల్ డిపార్ట్మెంట్లో అపార్ట్మెంట్ లకు, గేటెడ్ కమ్యూనిటీలకు పర్మిషన్ ఇవ్వాలంటే 20% కమిషన్ నిర్ణయించుకొని పరిపాలన సాగిస్తున్నాడని ఆయన అన్నారు. కాంగ్రెస్ వైఫల్యం వల్లనే వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు.మొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎండల వల్ల పంటలు ఎండిపోతుంటే కెసిఆర్ , హరీష్ రావు సంతోషపడుతున్నారని అన్నాడు. బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు కూడా ఎండలు కొట్టాయి. కానీ ఆనాడు ఎందుకు పంటలు ఎండలేదు, ఈరోజు ఎందుకు ఎండిపోతున్నాయి? మండుటెండల్లో కూడా వాగులు, వంకలు, చెరువుల్లో నీళ్లు ఉండేవి. ఒక ఎకరం కూడా ఎండకుండా కెసిఆర్ గారి పాలనలో పంట పండింది. పాలన చేతకాక ప్రకృతిపైన, ప్రతిపక్షాలపైన నిందలు వేసి తప్పించుకునే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తుండు.ఇది కాలం తెచ్చిన కరువు కాద రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని ఆయన ధ్వజమెత్తారు.దేవాదుల ఓ అండ్ ఎం కాంట్రాక్టర్ కు 7000 కోట్లు బిల్లులు చెల్లించకపోవడం వల్ల 33 రోజులు పంపుల మోటర్లు ఆన్ చేయలేదు. 33 రోజులు దేవాదుల పంపుల మోటార్లు ఆన్ చేసి ఉంటే రిజర్వాయర్లు నిండేవి, పొలాలకు నీళ్లు వచ్చేవి.

రేవంత్ రెడ్డి చేసిన తప్పును ప్రకృతి మీద మోపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నీళ్లు ఇవ్వద్దని మోటార్లకు అడ్డంగా హరీష్ రావు, బిఆర్ఎస్ నాయకులు నిలుచున్నారా?

ఈసారి ప్రకృతి కనికరించింది. పోయినసారి కంటే ఈసారి వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. వేలాది టీఎంసీల నీళ్లు గోదావరిలో కలిశాయి. కెసిఆర్ ఉన్నప్పుడు చుక్క చుక్కను ఓడిసిపెట్టాడు.రేవంత్ రెడ్డి ఏమో నీళ్ళను వృథాగా వదిలిపెడుతుండు. గోదావరిలో ప్రవాహం ప్రారంభం అయిందని తెలివంగానే మోటర్లు ఆన్ చేసి రిజర్వాయర్లు చెరువులు కుంటలు నింపి ఉండాల్సింది.

సకాలంలో ఓ అండ్ ఎం పనులు పూర్తిచేసుకుని ఎండాకాలం కోసం నీళ్లు సిద్ధం చేసుకోవాల్సింది.

**తెలంగాణకు పట్టిన గ్రహణం రేవంత్ రెడ్డి.**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పట్టు వదలకుండా ప్రభుత్వంతో పోరాటం చేసి ఇరిగేషన్ మంత్రి, ఇరిగేషన్ సెక్రటరీ చుట్టూ తిరిగి వెంటపడి 30 రోజులకి ఏడు కోట్ల రూపాయలు విడుదల చేయించుకొని మోటర్లు రిపేర్ చేపించారు. 33 రోజులు మోటర్లు బాగు చేసి ఘనపూర్ నింపుకొని, చలి వాగు నింపుకొని, ధర్మసాగర్ నింపుకొని, గడ్డి రామారం నింపుకొని, బొమ్మకూరు నింపుకొని, తపాస్పల్లి దాకా నీళ్లు తెచ్చుకునే వాళ్ళం. ఇప్పుడు మోటార్ ఆన్ చేసిన నీళ్లు అందని పరిస్థితి ఉంది. ఒక వరంగల్ జిల్లాలోనే లక్ష ఎకరాలు ఎండిపోతున్నాయి అంటే ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, రేవంత్ రెడ్డి చేతకానితనం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. కృష్ణానదిలో రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు నీళ్లు దోచుకుంటుంటే కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మౌనంగా ఉన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడలేదు. కాబట్టి ఈరోజు నల్గొండ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయి. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్ నగర్ లో కూడా పంటలు ఎండిపోతున్నాయి. ఈరోజు నల్గొండ, మహబూబ్ నగర్ లో పంటలు ఎండిపోవడానికి ఆంధ్రప్రదేశ్ అడ్డగోలుగా కృష్ణ నది జలాలను దోచుకోవడమే కారణం. కెసిఆర్ హయాంలో సమ్మక్క సాగర్ కట్టారు. మూడు నుండి నాలుగు టీఎంసీల నీళ్లు ఈరోజుకి సమ్మక్క సాగర్ లో ఉన్నాయి. ప్రభుత్వం బిల్లులు లేకపోవడం వల్ల, మోటార్లు సకాలంలో ఆన్ చేయకపోవడం వల్ల నీళ్లు రావడం లేదు. దేవాదుల ఫేజ్ 3 కూడా పూర్తయింది. ఫేజ్ 3 మోటార్ ఆన్ చేస్తే కూడా ఇంకెక్కువ నీళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. 60 , 70 శాతం పంటలు ఎండిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ జిల్లా కాంగ్రెస్ మంత్రులు, నాయకులు పట్టించుకోరా? రివ్యూ చేయరా? లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతుంటే కాంగ్రెస్ నాయకులకు చీమ కుట్టినట్టయినా లేదా? అంటూ హరీష్ రావు మాట్లాడుతూ ఆగ్రహంగా ప్రశ్నల వర్షం కురిపించారు. చీవెంటనే దేవాదుల ఫేజ్ 3 మోటార్లను ప్రారంభించి పంట పొలాలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేస్తున్నాం. పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టినవ్, యసంగి రైతుబంధు పడలేదు, రుణమాఫీ కాలేదు, ఎరువుల తిప్పలు పోలేదు, మోటార్లు కాలిపోతున్నాయి. ఇంకా 400 కోట్ల రూపాయల సన్న వడ్ల బోనస్ పెండింగ్ ఉన్నాయి. యాసంగి పంట కోతకొచ్చినా ఇప్పటికీ వానకాలం పంట బోనస్ డబ్బులు ఇంకా రైతులకు పడలేదు. ఈ ప్రెస్ మీట్ లో రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావు తో పాటు జనగాం ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి , టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మధుసూదనాచారి, ప్రశాంత్ రెడ్డి కౌశిక్ రెడ్డి, జనగామ జిల్లా నాయకులు తదితరులు అనేకమంది పాల్గొన్నారు

